సాక్షి

# చకచకా..

- మెట్రో మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్
- తుది దశకు చేరిన నిర్మాణ పనులు
- పూర్తిగా ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

**సాక్షి, సిటీబ్యూరో:** పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో హైదరాబాద్ మెట్రో రైల్ చేపట్టిన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు రూ.80 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలోనే తొలిసారిగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో ఈ మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి రానుంది. తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలను పార్కింగ్ చేసేవిధంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు.

### ఆటోమేటెడ్ పార్కింగ్ సదుపాయం..

- మల్టీలెవల్ పార్కింగ్ అత్యాధునిక ఆటోమేటెడ్ కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్ లో వాహనాల రాకపోకలకు (ఇన్/అవుట్) నాలుగు టెర్మినల్స్ ఉంటాయి. వాహనాలు నిలిపేందుకు టర్న్ టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ టేబుల్‌పై వాహనదారు తన వాహనాన్ని వదిలి నిర్దేశిత పనులకు హాజరు కావచ్చు.
- మల్టీలెవల్ పార్కింగ్ లోనికి వాహనం ప్రవేశించగానే వాహనదారుకు ఒక స్మార్ట్ కార్డు జారీ అవుతుంది. రెగ్యులర్‌గా ఆ పార్కింగ్‌ను వినియోగించేవారికి 'ఆర్ఎఫ్ఐడీ' కార్డులు కూడా జారీ చేస్తారు. వాహనదారులకు కేటాయించిన టెర్మినల్ సమాచారం ముందుగానే తెలియజేస్తారు.
- వాహనం కొలతలు ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాలను వర్గీకరిస్తారు. ఎస్‌యూవీ లేదా సెడాన్ వాహనాలకు తగిన విధంగా 'పార్కింగ్ బే'లు ఉంటాయి.
- వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలంలోకి తీసుకెళ్లేందుకు ట్రాన్స్‌పోర్టర్ షటిల్ పని చేస్తుంది. ఇది లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో కేటాయించిన స్థలంలో వాహనాన్ని పార్క్ చేస్తుంది. ఈ మేరకు విశాలమైన, సౌకర్యవంతమైన టర్న్ టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముంబై, ఢిల్లీలో ఉన్న మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థల కంటే మరింత మెరుగైన సదుపాయాలను కల్పించనున్నారు.
- పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి, డ్రైవర్ పార్కింగ్ రుసుము చెల్లించి, పార్కింగ్ టిక్కెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపిన వెంటనే ట్రాన్స్‌పోర్టర్- షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారుకు అందజేస్తుంది. డ్రైవర్ కారును రివర్స్ తిప్పవలసిన అవసరం ఉండదు.
- పార్కింగ్ చేసేందుకు కేవలం నిమిషంకంటే తక్కువ సమయం పడుతుందని, తిరిగి పొందేందుకు 2 నిమిషాలు మాత్రమే పడుతుంది.
- హైదరాబాద్ మెట్రో రైల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆధునిక పార్కింగ్ కాంప్లెక్స్ నగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి కానుందని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

### 15 అంతస్తులు..
### 1.44 లక్షల చ. అ. విస్తీర్ణం..

నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్‌కు సమీపంలో హెచ్ఎంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15 అంతస్తుల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతోంది. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. మరో 5 అంతస్తుల్లో షాపింగ్ కేంద్రాలు, రెండు స్క్రీన్లతో కూడిన సినిమా థియేటర్ ఉంటాయి. మొత్తం 1.44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 68 శాతం వరకు వాహనాలకు పార్కింగ్‌కు, మిగిలిన 32 శాతం వాణిజ్య సదుపాయాలకు కేటాయించనున్నట్లు ఎన్వీఎస్ తెలిపారు. పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు అవకాశం ఉంటుంది. మెస్సర్స్ భారీ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పీపీపీ విధానంలో పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయని, త్వరలోనే ఆధునిక పార్కింగ్ సదుపాయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. నెల రోజుల్లో ట్రయల్ రన్‌ను ప్రారంభించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.